మినీకథ

# చేతులు కాలాక

పదిన్నరకు బ్యాంకుకి వెళ్ళాలి. అప్పుడే పది దాటింది. జగన్ ఆఫీస్ ఇంటికి ఆ వైపునయితే హిమ బ్యాంక్ ఈ వైపున. ఎనిమిదిన్నరకే వెళ్ళాలి జగన్. అందుకే ఏ రకం గానూ అతను తనను డ్రాప్ చేసి వెళ్ళే అవకాశం లేదు.

బస్ రాలేదింకా. అయిదు నిమిషాల్లో యాభై సార్లు వాచ్ చూసుకుంది హిమ.

అలవోకగా తల తిప్పిన ఆమెకు–'అదిగో ఆ చివర ఆ గడ్డం మనిషి తన వంకే చూస్తున్నట్టున్నాడు' అనిపించింది. అతనిక్కనిపించకుండా కాస్త పక్కకు వెళ్ళి బస్ షెల్టర్ వెనకున్న చెట్టుక్రింద నించుంది హిమ. రెండు నిమిషాలు గమనించనట్టుగా నటించి అతన్నిలుచున్నవేపు దృష్టి సారించింది. ఆశించినట్టుగా అతనక్కడ లేడు. 'అమ్మయ్య పీడ విరగడైంది' అనుకుని తల తిప్పిందో లేదో– అదిగో ఆ పాన్‌షాప్ ముందు ఆ గడ్డమే.

హిమజకు ముచ్చెమటలు కమ్మాయి.

ఎవడు వీడు? ఎందుకిలా తన వెంటపడ్డాడు? ఎన్నాళ్ళుగా తనను కావలా కాస్తున్నాడు? కొంపదీసి జగన్ ఇతన్ని నియమించాడా?

జ్ఞాపకాల్ని వెనక్కి లాగి జగన్ ఫొటోల్లో అతనెక్కడైనా వున్నాడా అని ఆలోచించింది. ఏమో! జగన్‌కి ఒకళ్ళిద్దరు గడ్డం వున్న ఫ్రెండ్స్ వున్నారు గాని వాళ్ళలో ఒకతను సిక్కు. తలకు గుడ్డపాగా వుంది. అది బాగా గుర్తు. మరో వ్యక్తి పచ్చటి పసిమి ఛాయ. కాని ఇతనికి తలపాగా లేదు. సిక్కు కాదు. మరీ అంత తెలుపనీ చెప్పలేం. తెలుపు కాదనలు, చామన ఛాయ. ఎందుకు తన వెనకే తిరుగుతున్నాడు?

ఆమె ఆలోచనలో కొలిక్కిరాక ముందే మెట్రో ఎక్స్‌ప్రెస్ వచ్చి ఆగింది. ఆమె ఒక్క క్షణం ఎక్కాలా వద్దా అన్నట్టు తటపటాయించింది. చివరి క్షణంలో బస్ కదిలే ముందు పరిగెత్తుకు వెళ్ళి స్టార్టయిన బస్సెక్కింది హిమ.

ఆ గడ్డం మనిషి పాన్‌షాప్ ముందు నిలబడి పేపర్ చదువుతున్నాడు.

"ఎక్కితే గబుక్కున ఎక్కాలి, లేదంటే లేదు. కాని ఓ గంట ఆలోచించి –ఎక్కాలా? వద్దా? అని బేరీజు వేసుకుని మనసులో లాటరీ వేసుకుని మరీ ఎక్కుతారులా వుంది" గొణుగుతున్నాడు డ్రైవర్.

వెనకాల ఎవరో కిసుక్కున నవ్వారు.

హిమ మొహం ఎర్రబారింది.

కుడి వైపు కిటికీ వైపు కూర్చుని కండక్టర్ కోసం తల తిప్పి వెనక్కు చూసింది.

వెనకాలెక్కిన మగవాళ్ళకు టికెట్స్ ఇస్తున్నాడు కండక్టర్. చాలా మందే వున్నట్టున్నారు.

ఆ గళ్ళ చొక్కా మనిషి ఎందుకలా తన వంక చూస్తున్నాడు? ఇదివరకు తనను ఎక్కడైనా చూసాడా? తనకైతే ఎక్కడా పరిచయమున్నట్టే అనిపించడం లేదు. తన వైపు చూస్తున్నాడా? తన



భ్రమా? ఏమో!

తల తిప్పి కిటికీలోంచి చూసిందో నిమిషం. మళ్ళీ అతని చూపులు గుచ్చుకున్న ఫీలింగ్‌తో అతను వైపు తల తిప్పింది.

నిజమే. రెప్పవాల్చకుండా తనవే గమినిస్తున్నాడు. అతనికి తన 'గతం' తెలుసా, ఒక వేళ అతవా సంగతి తన భర్త- జగన్‌కు చెబితే...

పెళ్ళయి గట్టిగా ఆర్నెల్లవలేదు. జగన్ ఎలాంటి వాడో.. తీరా అమమావం వచ్చి నీ వుట్టింటికి మవు పొమ్మంటే.... ఊరంతా యాగీ చేసి రచ్చ కీడిస్తే.....

ఈ లోగా కండక్టర్ ముందుకి వచ్చాడు.

ఆ గళ్ళచొక్కాకి అడ్డంగా– అతనక్కడే రాతి స్థంభంలా ఫిక్సైపోతే బాగుండు ననిపించింది.

ఉహూ–

అలా వెనక్కు వాలి ముందుకు తూలి మరీ చూస్తాడేం....

"ఏ లోకంలో ఉన్నారు? టికెట్ మాడమ్" ఉలిక్కి పడింది కండక్టర్ పిలుపుతో.

టికెట్ తీసుకుని, ఎటో చూస్తున్నట్టు కంటి కొసల్నించి అతన్ని గమనించింది.

చూపుల తూపుల్ని తన వంక రువ్వుతూనే ఉన్నాడు.

గాజు ముక్కల మొనల మీద నడుస్తున్నట్టనిపించింది హిమకు.

బస్ ఆగింది. దిగి పోదామా? అనిపించింది. అరికాళ్ళలో చమటలు తెలుస్తున్నాయి.

ఆమెను ఆదుకుందుకా అన్నట్టు ఆమె దిగవలసిన స్టేజీ వచ్చింది.

ఒక్క క్షణం ఆగి బస్ కదిలాక దిగిందామె.

"స్టార్టింగ్ ట్రుబుల్" ఎవరిదో కామెంట్.

ఆ గళ్ళ చొక్కా వాడు కిటికీ లోంచి తన వంకే చూస్తున్నట్టనిపించింది.

గబా గబా నడిచి పది ఇరవై అయిదు కల్లా బ్యాంక్ ఆవరణలో అడుగు పెట్టి అమ్మయ్య అనుకుంది.

అయితే ఆ రిలీఫ్ ఎంతోసేపు నిలవలేదు.

"ఎవరో మీ కోసం ఫోన్ చేసారు. హిమగారూ" శ్రీనివాస్ చెప్పాడు.

"నా కోసమా? ఆడవాళ్ళా? మగవాళ్ళా?" ఆశ్చర్యపోయింది.

"మగవాళ్ళే"

"మగవాళ్ళా? మా ఆయనా?"

"కాదనుకుంటాను. ఎవరిని అడిగే లోపలే ఫోను పెట్టేసారు"

నిర్లక్ష్యంగా పెదవి విరిచినా, ఎవరై వుంటారా అన్న ఆలోచన ఆమె మెదడును కొరికెయ్య సాగింది.

ఎవరైనా బ్లాక్ మెయిలరా?

నిన్ను అతనితో ఫలానా చోట చూసాను. ఓ పాతిక వేలిస్తే కాని చెప్పనని అంటాడా?

అతనే ఏవైనా ఫొటోలు తీయించి...... వేలేమిటి లక్షలు అడిగితే ఏం చెయ్యాలి?

తనకు మిగిలినది గోదారే!

అన్యమనస్కంగా రోజంతా ఆలోచనల్లో, అనకత నక వనుల్తోటే గడిచిపోయింది హిమకు.

* * *

అర్ధరాత్రి రెండు దాటింది.

హిమ చుట్టూ ఒక చెయ్యి వేసి జగన్ నిశ్చింతగా నిద్రపోతున్నాడు.

కంటిమీద కునుకు రాని హిమకు గతం వెన్నాడుతోంది.

'మనం ఎంత సుఖపడగలం అన్నదే ఇవ్వాల్టి ప్రశ్న' కౌగిట్లో ఆదుముకుంటూ అతని నలహా.

'ప్రతి విషయం ప్రతి వాళ్ళకూ చెప్పితీరాలా? పెళ్ళయాక నీ భర్త నీకు ప్రతి మాటా చెప్తాడా! నువ్వూ అంతే!'

సంగీత ప్రపంచంలో ఓ ఆధారం కోసం అతని వెంట తిరిగి చివరకు....

హిమ కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

అవసరం తీరాక ఆ 'మోజు' తగ్గిపోయాక, రేడియోలో, టీవీల్లో ఒకటి రెండు పాటలు పాడించి, మొహం తప్పించాడు. తను రెంటికీ చెడ్డ రేవడిలా ఇలా––

కళ్ళల్లో సముద్రాలు పొంగాయి.

జగన్ని లేపి జరిగినది చెప్పేద్దామా అనిపించిందో క్షణం.

కాని అంత ధైర్యమేదీ?

ఈ చిత్ర హింస.. ఈ నరకం స్వయంకృతాపరాధం కాదా...

"చేతులు కాలాక......అనుభవించాలి. కన్నీళ్ళ ఉప్పను భరించాలి."

– శ్రీపాద స్వాతి